# అనుకరణ

"శైలజ"




కరతాళ ధ్వనులతో మార్మోగిందా హాలు.

సుధాకర్‌ని పూలదండలతో ముంచేశారు అభిమానులంతా.

తమ చేసిన మిమిక్రీని గురించి ప్రతివాళ్లూ 'అచ్చు' అలాగే, అసలేమీ తేడాలేకుండా 'సేమ్' అలాగే చేశాడని శ్లాఘించారు ప్రేక్షకులంతా.

జంతువుల అరుపులూ, వాహనాల మోతలూ, నటీనటుల నటనా పద్ధతులూ, నాయకుల ప్రసంగాలూ అన్నింటినీ తన గొంతుకద్వారా వెలువడింపజేసి ప్రేక్షకులను రెండు గంటల వరకూ ఉర్రూతలూగించిన మిమిక్రీ ఆర్టిస్ట్ సుధాకర్‌ని ఆ సభలో మెచ్చుకోనివాళ్లు లేరు.

కార్యక్రమం అవగానే ఇంటికి చేరాడు సుధాకర్.

పాప ఇంకా నిద్రపోలేదు.

ఔను జోలపాట పాడితేగాని పాప నిద్రపోదు

"పడుకోమ్మా – నేను పాట పాడతాను" బుజ్జగించాడు.

"అమ్మలాగే పాడాలి" పాప శాసించింది.

"అలాగే" అన్నాడు.

తన అనుకరణ సామర్థ్యాన్నుపయోగించి భార్య శైల గొంతుతో జోలపాట మొదలెట్టారు.

పాప ఇంకా నిద్రపోవడంలేదు.

"ఏమ్మా! పాట బాగోలేదా!" పరామర్శించాడు.

"నువ్వు అమ్మలాగా ఏం పాట్టంలేదు" పాప.

అనుకరణ సామ్రాట్ సుధాకర్ ముఖంలో మిగిలింది ప్రశ్నార్థకం మాత్రమే... !